# దేవుడే శిక్షించాడు

శ్రీశ్రీశ్రీ వినయానంద స్వామీజీ విజయం చేసే ట్రెయిన్ మూడు గంటలు లేటు! స్తంభాన్ని ఆనుకొని ఎదురుచూస్తున్న వెంకట్రావుకు విసుగు కలిగింది. నిజానికి అతని మనసు మనసులో లేదు. కారణం? ఎప్పుడూ లేనిది అతడివాళ భార్యమీద చేయి చేసుకున్నాడు. చేసుకోడూ మరి! ఆమె ఎన్నెన్ని మాటలంది! తనను అంటే ఫర్వాలేదు. కాని తాను దైవంగా భావించే శ్రీవారినే శంకించి అనరాని మాటలంది. కళ్ళు పోవూ? ఆమెను కొట్టి, బాగా బుద్ధి చెప్పాడు తను.

మంచి పనిచేసినట్లు నమ్మబోయాడు వెంకట్రావు; కాని అతని హృదయం కాదంటున్నది. వరలక్ష్మి లాంటి భార్య దొరికినందుకు అతడెన్నో సార్లు గర్వించాడు.

ఆమె అందగత్తె. అనురాగమయి. "అది కావాలి; యిదికావాలి" అని యాగీచేయదు. భర్త, భార్యలో కోరుకునే సకల సద్గుణాలూ ఆమెలో వున్నాయి.

ఆలోచనలు ఆమెవైపు మళ్ళగానే— అలాంటి దేవతనా కొట్టావు?—అని హృదయం అతనిని నిలదీసింది!

"బాబూ, ధర్మం చెయ్యి బాబూ...."— బిచ్చగాని ఆక్రందన. చెవిలో రొద! ఆలోచన తెగిపోయి, వళ్లు మండింది వెంకట్రావుకు. "పొమ్మంటే నీక్కాదూ?" అని విసుక్కున్నాడు. వాడెంతకూ కదలకపోతే తనే బయటకు నడిచాడు.

కారువద్ద నిలబడి బీడీ కాల్చుకుంటున్న డ్రైవరు, వెంకట్రావు రాగానే "బాబూ, బండి లేటు కాబోలు. అలా వెళ్ళి యిప్పుడే వస్తా" నంటూ జారుకున్నాడు.

స్వామీజీని మోసే అదృష్టం తనను వరించినందుకు గర్వపడుతూ కలలుకంటున్నది-విమానం అంత-టాప్ లేని కారు! బ్యాండ్ వాద్యగాళ్ళంతా తమ తమ వాయిద్యాలను పరీక్షించుకుంటూ, చెట్లక్రింద కబుర్లు చెప్పుకుంటున్నారు. వెంకట్రావు రాగానే వాళ్ళంతా గౌరవంగా లేచి నిలుచున్నారు.

"సాములోరి బండి నేటుగా రాడం ఏటి సార్! మహిమలు సూపి ఝూమ్మని వచ్చేయక!" అన్నాడొకడు. "ఓరొల్లకోయెహే! సాములారు ఒస్తున్నారని తెలిసి మద్య మద్య తేషన్ల్లో జనాలు బండినాపేసి పూజలు సేస్తున్నారంట. అందుకే నేటయిపోనాది" అంటూ చుట్ట పారేసి తుపుక్కున ఊసాడొకడు.

అక్కడనుండి మరి కాస్త దూరం వెళ్ళాడు వెంకట్రావు. అప్పటికే రోడ్డు కిరువైపులా చేరిన జనాలను పోలీసులు అదుపులో ఉంచుతున్నారు. పురప్రముఖుల కార్లు బారులు తీరి విశ్రాంతిని అనుభవిస్తున్నాయి. యజ-

ప్రఫుల్లచంద్ర

మానులు కార్లలోనే కూచుని ట్రెయిన్‌కోసం ఎదురుచూస్తున్నారు. ఒకరిద్దరు వెంకట్రావుని పలుకరించారు కూడా. సాక్షాత్తు లక్షాధికారులు తనను గుర్తించి గౌరవించినందుకు ఆ చిరుద్యోగి చిన్న హృదయం పొంగిపోయింది! హృదయంలోని వరలక్ష్మి తొలగిపోయింది!

దూరంగా ఉన్న చెట్టునానుకొని గతాన్ని నెమరు వేసుకుంటున్నాడు వెంకట్రావు. దైవ చింతన అంతగాలేని అతడు భక్తుడుగా మారడం-అతనికే ఆశ్చర్యం కలిగిస్తూ వుంటుంది.

ఆనాడు అతనికి బాగా గుర్తు.

దినపత్రికలో అతడా వార్త చదవగానే గుండె ఝల్లుమన్నది. అవినీతి నిరోధక శాఖ వలవేసి ఒక ఆఫీసరు లంచం తీసుకుంటూ వుండగా ఎలా పట్టుకున్నదీ వివరిస్తోందా వార్త....అంతే. జేబులోని పది రూపాయిల కాగితం గుండెను కాల్చివేయడం మొదలుపెట్టింది! ఇక ఆరోజు పనిచేయలేకపోయాడు. విషయం తెలుసుకున్న శేషాద్రి ఎంతగానో ధైర్యం నూరిపోసాడు. అతనికేం? నిండా మునిగిన పిండం! అతని ధైర్యం వెంకట్రావు కెలా వస్తుంది? నిజానికి వెంకట్రావుని లంచాలలో ముంచిన దతడే.

ఉద్యోగంలో చేరిన కొత్తలో వెంకట్రావు ఆఫీసులో జరుగుతున్న అన్యాయాలనుచూసి అసహ్యించుకునేవాడు. తనపని సవ్యంగా చేసుకుపోయేవాడు. ఎంత జాగ్రత్తగా చేసినా ఆఫీసరు కస్సు బుస్సు మనేవాడు.



ఎందుకో?

"రోజుకు యిన్ని ఫైళ్ళు పుటప్ చేస్తున్నావ్! ఎంత ముడుతోంది?" అని వ్యంగ్యంగా ప్రశ్నించాడు ఆఫీసరు ఒకనాడు. గుండెలో శూలం గుచ్చినట్టు బాధపడ్డాడు వెంకట్రావు. అప్పుడే శేషాద్రి అతనికి హితబోధ చేసాడు.

"చూడు బ్రదర్....సాధారణం, దారుణం అని లంచాలు రెండురకాలు. రూల్సు ప్రకారం ఆటంకం ఉండదుగాని ఫైలు కదలదు. తోయాలి. అందుకు తైలం కావాలి. ఇది సాధారణం. గుమాస్తా చేతిలో పని. ఇక రూల్సుని అధిగమించి ఫైలు మారుతిలా దూసుకుపోతుంది. అందుకు ఆఫీసరు పూనుకోవాలి. గుమాస్తా లెవెల్లోకాదు. అందుకు లక్ష్మీపూజ జరగాలి. ఈ పూజలో గుమాస్తా పూజారి మాత్రమే. వాటా వుంటుందిగాని స్వతంత్రం వుండదు....ఇదీ దారుణం. కావున ఓ శిష్యా ఇకనుండి ఫైళ్ళను వెంటనే హత్య చేయకు. నీ టేబుల్ మీద ఒక వారం రోజులు హాయిగా బ్రతకనివ్వు. అందువల్ల నువ్వు బ్రతికిపోతావ్." ఈ హితబోధను వెంకట్రావు చెవిలో పెట్టినా, మదిలో పెట్టలేదు!

పాపకు హఠాత్తుగా జ్వరం వచ్చింది. వరలక్ష్మి ధర్మాసుపత్రిలో రోజంతా పడిగాపులు పడితే వాళ్లిచ్చిన రంగునీళ్ళవల్ల జ్వరం మరింత ఎక్కువైంది. ప్రయివేటు డాక్టరు రాసిన మందులు కొనడానికి డబ్బు లేక, అప్పు చేయడం యిష్టంకాక, అడ్వాన్సు కావాలని వెంకట్రావు ఆఫీసరుగార్ని అడిగితే "రూల్సు ఒప్పుకోవని" నిష్కర్షగా చెప్పాడాయన!

శేషాద్రి, విషయం గ్రహించి వెంకట్రావుని క్యాంటీన్‌కు లాక్కుపోయి దూరంగా వున్న ఒక పెద్దమనిషిని చూపుతూ చెవిలో గుసగుస లాడాడు. అతని జేబులో 20 రూపాయిల నోటు దూర్చి "సాధారణం!" అని నవ్వాడు.

అంతే. వెంకట్రావు జీవితంలో అదొక మైలురాయి!

రోజులు గడుస్తున్నవి. జేబులు నిండుతున్నవి. కడుపునిండా తిండి, మంచి బట్టలు. వారానికొక సినిమా.

బంధువర్గంలో అతని పరపతి యిప్పుడు పెరిగిపోయింది. ఊళ్ళో ఒక గుర్తింపూ గౌరవం లభించాయి. అంతా బాగానే వుంది.... కాని....

ఏ పాప ఆరోగ్యంకోసం అతడు లంచం మరిగాడో ఆ పాప ఆరోగ్యం బాగుపడనే లేదు. తింటుంది. తిరుగుతుంది. ఆడుకుంటుంది...."అమ్మయ్య!" అనుకునేంతలో మళ్ళి సుస్తీ చేసి మంచం ఎక్కుతుంది.

మళ్ళి డాక్టర్లూ, మందులూను.


అసలు పాపకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందా-అని అనుమానం! ఆ అనుమానం వెనుక-అన్యాయార్జితం యిలానే హరించుకుపోతుందన్న భయం-ఆ భయం వెనుక-తను చేస్తున్న అన్యాయానికి ప్రాయశ్చిత్తం పాప అనుభవిస్తున్నదేమో నన్న బాధ!

అందువల్ల లంచం పట్టినప్పుడల్లా మనసు చివుక్కుమంటూనే వుంది. మనశ్శాంతి పోతూనే వుంది. పైగా ఆనాడు పేపర్లో ఆ వార్త చదివాడు! శేషాద్రి ఎంత ధైర్యం నూరిపోసినా అతని మనసు స్థిమితపడలేదు. తను పట్టుబడి, తన ఉద్యోగం ఊడితే! హేయ్ రామ్!!

వెంకట్రావు ఆఫీసునుండి యింటికి వెళ్ళగానే పాపకు మళ్ళీ జ్వరం వస్తోందని చెప్పింది వరలక్ష్మి. గుండెల్ని కాల్చివేస్తున్న పది రూపాయిలనోటు తీసి ఆమెకిచ్చి ఉసూరుమని వాలుకుర్చీలో కూలిపోయాడు. అతని మనసుకు విశ్రాంతి లభించలేదు. మనశ్శాంతి వెదుక్కుంటూ అతడు పార్కుకి వెళ్ళాడు కాని అతని చుట్టూ ఉత్సాహం! అతనిలో శూన్యం!! చుట్టూ అందమూ, ఆనందమూ. కాని అతనిలో బాధ!

విసిగిపోయి టౌనుహాలు వైపు బయలు

దాగుడు మూతలాడుకొందామా? బావా??



దేరాడు. అక్కడెవరో స్వామీజీ ఉపన్యసిస్తున్నారు. నిలబడే విన్నాడు వెంకట్రావు.

మృదు గంభీరమూ ఆకర్షణీయమూ అయిన స్వరంతో-చిన్నపిల్లలక్కూడా అర్థం అయేట్టు హిందూమత ప్రాశస్త్యం, పాప పుణ్యాలు, దైవకృప గురించి స్వామీజీ అనర్గళంగా ఉపన్యసిస్తున్నారు. వెంకట్రావు నాస్తికుడు కాకపోయినా, ఎప్పుడూ గుడికి వెళ్ళలేదు. ఇలాంటి వుపన్యాసాలు అసలు వినలేదు. కాని యిప్పుడు వింటూ వుంటే ఏదో తన్మయత్వం కలిగిందతనికి. ఆ తన్మయత్వంలో "హేయ్‌రామ్! నేను చేస్తున్న అన్యాయాలకు నన్నే శిక్షించు. పాపను రక్షించు" అని మనసులోనే ప్రార్థించుకున్నాడు. విచిత్రంగా అతని మనసుకు ఊరట లభించింది.

అంతే. ఆనాటినుండి వెంకట్రావు పరమ భక్తుడు అయాడు. చెవిలో పూవు, నుదుట తిలకం పెట్టుకోకపోయినా రోజూ పూజ చేయడం ప్రారంభించాడు. మనసు బాగులేకపోతే-సినిమాకు కాదు-గుడికి వెళ్తాడు. భక్తి ఉపన్యాసాలు మిస్ అవడు. తప్పనిసరిగా సినిమాకు వెళ్ళవలసివస్తే "భక్తి సినిమా"లకే వెళ్తాడు. పట్నంలోని ఒక ఆస్తిక సంఘంలో సభ్యుడై ఏకాహాలూ, సప్తాహాలూ భజనలూ నిర్వహించడంలో ప్రముఖ స్థానం వహిస్తున్నాడు. ఆఫీసు పనిమీద అతనివద్దకు వచ్చేవారు-ఇంత చిన్నవయసులో ఎంత భక్తి! పూర్వజన్మ సుకృతం!!-అని అతనిని పొగడి "పూజ ఖర్చుకు యిది వుంచండి" అంటూ పదో, పరకో చేతిలోపెట్టి పనులు జరిపించుకునేవారు! లంచం, పూజఖర్చుగా మారింది. భక్తి బాధను పారద్రోలింది! వెంకట్రావు పూజఖర్చు భారీగా వసూలు చేయడానికి కూడా బాధపడటం లేదిప్పుడు. ఆఫీసరు కూడా ప్రసన్నంగానే వుంటున్నాడు. వారింట్లో వ్రతంగానీ పూజగానీ వుంటే వెంకట్రావుని తప్పక ఆహ్వానిస్తున్నాడు. వారి భార్యామణి కూడా అతనిని గౌరవించి, పూజకు కావలసిన సామగ్రి లిస్టు యిస్తుందతనికి. డబ్బు యివ్వదు. అతడు అడగడు! కాని కావలసిన సామగ్రి అంతా తెస్తాడు. పూజసామగ్రి మాత్రమే కాదు. కిరాణాకూడా! దేవుడుకూడా వెంకట్రావు తప్పుల్ని క్షమించినట్టే కనిపిస్తోంది. ఎందువల్లనంటే నాలుగైదు నెలలుగా పాప ఆరోగ్యం బాగానే వుంది.

* * *

శ్రీశ్రీశ్రీ వినయానంద స్వామీజీ తమ పాద ధూళితో తమ పట్నాన్ని పావనం చేయనున్నారన్న వార్త ఆస్తిక సంఘాలన్నిటిని పులకరింపజేసింది. అనునిత్యం సమ

క్షంలోవుండి స్వామీజీని సేవించుకోవాలని ఉబలాటపడ్డాడు వెంకట్రావు. స్వామీజీని ఆహ్వానించి, వారికి సకల సదుపాయాలు సమకూర్చి, ఉపన్యాసాలూ, పూజలూ ఏర్పాటు చేయడానికి ఒక సంఘం ఏర్పడింది. వెంకట్రావు ఆ సంఘ సభ్యుడయ్యాడు. ఆ సంఘం-స్వామీజీ విజయం చేసేలోగా వారి దివ్యచరిత్రను ముద్రించడానికి పూనుకొని వివరాలు సేకరించింది.

శ్రీవారు అతిసామాన్య కుటుంబంలో ఉద్భవించారు. చిన్ననాటినుండి నిరంతరం ఏదో ఆలోచిస్తూ పరధ్యానంగా వుండేవారు. చదువు సంధ్యలబ్బలేదు. ఆ చిన్నతనంలో వారు భక్తపోతన సినిమా చూసారు. అంతే. ఆరాత్రి వారికి నిద్రపట్టలేదు. అర్ధరాత్రి అశరీరవాణి "లే నాయనా. నీవల్ల కాగల కార్యం ఒకటున్నది" అని వినిపించింది. వారు లేచారు. ఆకాశంవైపు దృష్టినిడి నడిచారు. ఏదో అదృశ్య శక్తి వారిని నడిపింది. వారు అలా నడిచి నడిచి దండకారణ్యంలో ఎవరూ చొరరాని ప్రదేశాన్ని చేరుకున్నారు. అలసిపోయి అక్కడే కూర్చున్నారు. అంతే. వారు అక్కడనుండి అసలు లేవనేలేదు. నిద్రాహారాలు లేవు. అన్నపానాలు లేవు. అసలు కదలికే లేదు. రోజులు గడిచాయి. ఋతువులు మారాయి. సంవత్సరాలే దొర్లాయి. ఒక రోజు హటాత్తుగా "లే నాయనా, ప్రపంచానికిప్పుడు నీ అవసరం కలిగింది. లే. లేచి ప్రపంచాన్నుద్ధరించు" అని చెవిలో వినిపించింది. వారు లేచారు. వారికి అక్షరజ్ఞానం అంతంత మాత్రమే. పెద్దగా తెలివితేటలూ లేవు. అలాంటి శ్రీవారికిప్పుడు అమోఘ వాక్పటిమ ఏర్పడింది. ఏ ధర్మసూక్ష్మమైనా యిట్టే విశదపరిచే నైపుణి దైవదత్తమైంది. దైవమే వారిని ఆదేశించినపుడు శ్రీవారికి యిక లోటేమిటి?

ఆనాటినుండి వారు విరామ మెరుగక ధర్మోపదేశం చేస్తూ దేశాటన మొదలుపెట్టారు. విదేశాలను సైతం తమ పాదధూళితో పునీతం చేసారు. వారేదేశం ఏగినా ఎందు కాలిడినా, ఆ దేశభాషలోనే అనర్గళంగా ఉపన్యసించేవారు. ఎంత అద్భుతం!

విదేశాల్లో మనవారు తెగతాగి నైట్ క్లబ్బుల్లో దొర్లుతూవుంటే వాళ్ళనుద్ధరించడానికి శ్రీవారు అక్కడికి వెళ్ళేవారు. కాని మూర్ఖులైన పత్రికా విలేఖరులు "నైట్ క్లబ్బుల్లో యిండియన్ సాధూ" అంటూ పత్రికల్లో విమర్శించినా శ్రీవారు పట్టించుకోలేదు. చెప్పి చేయిస్తున్నవాడు భగవంతుడే కనుక పాపపుణ్యాలు నన్ను అంటవు— అంటూ శ్రీవారు నైట్ క్లబ్బుల్లో మరింతగా విజృంభించారు.

వారిలో బ్రహ్మ తేజస్సు వుంది. కళ్ళలో అయస్కాంత శక్తి వుంది. స్వరంలో సంగీతమే వుంది. వారిని దర్శించగానే పరవశించిపోతారు ప్రజలు. స్వరం వినగానే వివశులైపోతారు. విదేశీయులను సైతం వారు శిష్యులుగా స్వీకరించి విశ్వమానవులంతా ఒకటే అని చాటారు. విదేశీ శిష్యులు పెద్ద కారుని పూలపల్లకిలా అలంకరించి స్వామీజీకి సూటు తొడిగి ఊరేగించారట. ఈర్ష్యచెందిన మన భారతీయులే "స్వామీజీ సూటు తొడుక్కోడం ఏమిటని?" ఆక్షేపిస్తే శ్రీవారు కోపగించుకోలేదు సరికదా-ఎంతఅమాయకులు మీరు!—అంటున్నట్టు చిరునవ్వు చిందిస్తూ "దేవుడొక్కడేకదా. మరి ఆ భగవంతునికి పులిచర్మం తొడిగి-శివుడు-అన్నాం. చీని చీనాంబరాలు ధరింపజేసి-విష్ణుమూర్తి-అన్నాం. గోచికట్టి-ఏసుక్రీస్తు - అన్నాం. ఈ అలంకారాలను చూసి భగవంతుడు కోపగిస్తాడా? అవన్నీ భక్తుని ఆనందాన్ని సూచించేవేగాని భగవంతుని బాధించేవి కావు. అలాగే నాకు మీరు గోచికట్టినా, కాషాయాలు తొడిగినా, సూటువేసినా-నాకు కోపం రాదు. అలంకారం కన్నా భక్తి ప్రధానం. భక్తుని ఆనందంకంటే భగవంతునికి కావలసిం దేముంది!!" అని సన్నగా తియ్యగా మందలించారట.

ఇక శ్రీవారు ప్రదర్శించిన అద్భుతాలు

అనేకం. చూస్తుండగానే ఫోటోలనుండి తేనె కారేది. సువాసనలు వెదజల్లే విభూతి ప్రేక్షకులమీద వర్షించేది. శూన్యహస్తంలోంచి గడియారం వచ్చేది. కళ్ళు మూసుకొని దైవ ప్రార్థన చేసుకుంటున్న ప్రేక్షకులకు విభూతి రాసి వారివారి యిష్టదైవాన్ని వారికి ప్రత్యక్షమయేట్టు చేసేవారు! వారికి అంతటి అతిలోక శక్తి వున్నది.

శ్రీవారు అమెరికాలో శివాలయం కట్టించడానికి విరాళాలు పోగుచేస్తున్నారు. అయితే అమెరికా శివుడు మన శివుడిలా చర్మం ధరించడు. చర్మం కట్టుకునేవారిని ఎవరు గౌరవిస్తారు? అందుకని శివవిగ్రహానికి సూటు తొడుగుతారు...."

"నంది విగ్రహం బదులు బెంజి కారు పెడతారు కాబోలు!...." పక పక నవ్వింది వరలక్ష్మి. తన్మయత్వంగా స్వామీజీ మహిమల్ని వివరిస్తున్న వెంకట్రావు పాముని చూసినట్టు ఉలిక్కిపడ్డాడు.

స్వామీజీపట్ల అతని తన్మయత్వాన్ని చూసి ఆమెకు తెరలు తెరలుగా నవ్వు వస్తూనేవుంది. కాని ఆమె నాస్తికురాలు కాదు. నిర్మల మనస్సుతో విగ్రహాన్ని గాని, మనసులోనే గాని దైవాన్ని ప్రార్థిస్తుంది. కాని వరాలు అడగడం, దేవుడికి "లంచం" ఇస్తాననడం ఆమె తత్త్వానికే విరుద్ధం. నలుగురి ముందూ భక్తిని ప్రదర్శించుకొని "భక్తురాలు" అని పిలిపించుకోడం ఆమెకు సుతరామూ యిష్టంలేదు. ఈ మధ్య భర్తలో కలిగిన "భక్తి" నవ్వు పుట్టిస్తున్నదామెకు. అయినా యెప్పుడూ అతనిని హేళన చేయలేదు. కాని యిప్పుడు మాత్రం నవ్వుని ఆపుకోలేకపోయింది. నవ్వుతూనే, స్నేహ మధురిమ నిండిన స్వరంతో "....మీది మరీ చాదస్తం. మీ స్వామీజీకి నిజంగానే మీరు చెప్పిన మహత్యాలన్నీ ఉంటే విరాళాలు పోగుచేయడం యెందుకు? టుష్‌మని లక్షలాది వాచీలు సృష్టించి అమ్ముకుంటే బోలెడు డబ్బు! అదీకాక అమెరికావారి అనుగ్రహంకోసం శివుడికి సూటు తొడుగుతారా?! రష్యావారి మెప్పుకోసం మహావిష్ణువు చేతిలో శంఖ చక్రాలకు బదులు సుత్తీ కొడవలీ పెడతారు కాబోలు! ఇంగ్లీషువారికి నచ్చాలని మహాలక్ష్మికి 'బికినీ' వేస్తారా?....భలే స్వామీజీ....మీ లాంటి అమాయకులుండబట్టే అలాంటి స్వామీజీలు బయలుదేరుతున్నారు...."

గట్టుతెగిన ప్రవాహంలా ఆమె నవ్వుతూనే ఉంది....చెంప ఛెళ్ళుమన్నది. అంతే. ప్రవాహం ఆగిపోయింది. కొట్టినందుకామె భర్తను ఏమీ అనలేదు. కాని తోకతొక్కిన త్రాచులా చివ్వున తల త్రిప్పి, నీళ్ళు నిండిన కళ్ళతో అతనివైపు తీవ్రంగా చూచి, గిరుక్కున తిరిగి లోనికి వెళ్ళిపోయింది!

ఆమె తీవ్రతను చూచి వణికిపోయాడు వెంకట్రావు. తరువాత తల పట్టుకొని కుర్చీలో కూలబడిన అతనికి పశ్చాత్తాపం లాంటిది కలిగినా, క్షమార్పణ చెప్పుకోడానికి అభిమానం అడ్డు వచ్చింది. అంతే. లేచి స్వామీజీ విడిది ఏర్పాట్లు పర్యవేక్షించడానికి వెళ్ళిపోయాడు.

భాగ్యవంతుడూ, భక్తుడూ అయిన ఒక స్మగ్లరు యింట్లో ఏ.సి. గదిని స్వామీజీకి కేటాయించారు. శిష్యులకూ, శిష్యురాళ్ళకు వారివారి ప్రాముఖ్యతనుబట్టి పెద్ద, చిన్న గదులు కేటాయించారు. అతిథి దేవులకు ఏం కావలసి వచ్చినా తక్షణం అమర్చడానికి ఒక డజను మంది వలంటీర్లు సిద్ధపడ్డారు. వారందరిమీదా అజమాయిషీ వెంకట్రావుదే. అక్కడి ఏర్పాట్లన్నీ సరిచూచి అటునుండి అలాగే స్టేషనుకు వెళ్ళాడు. వెధవ ట్రెయిన్ మూడు గంటలు లేటు!

* * *

"రైలు వస్తోంది!" ఎవరో అరిచారు. వాతావరణం ఒక్కసారిగా మేల్కొంది.

బిలబిల లాడుతూ అంతా స్టేషనులోనికి పరిగెత్తుతున్నారు. ఆలోచనలనుండి మేల్కొన్న వెంకట్రావూ పరుగు ప్రారంభించాడు.

"ధర్మం బాబూ!" అంటూ యిందాకటి ముష్టివాడు మళ్ళా యెదురయాడు.

వళ్ళు మండి, వాణ్ణి ప్రక్కకు గెంటి

ముందుకు సాగిపోయాడు వెంకట్రావు.

అంతమాత్రానికే ఆ ముష్టివాడు కింద పడ్డాడు. హడావుడిగా పరిగెత్తుకు వస్తున్న భక్తులు అతనిని త్రొక్కివేస్తున్నారు. వెంకట్రావు, వచ్చి, అతనిని లేవనెత్తాలనుకున్నాడు గాని అప్పటికే ట్రెయిన్ స్టేషనులోనికి వచ్చేసింది. వెంకట్రావు ముందుకే పరిగెత్తాడు.

స్వామీజీ పాదుకల ధూళి పడి రైల్వే ప్లాటుఫాం ధన్యమైంది. భక్తుల జయజయ ధ్వానాలకు బెదిరి చెట్లమీది పక్షులు భయం భయంగా అరుస్తూ చెల్లాచెదరైనవి. స్వామీజీ శరీరం ఎండలో బంగారంలా ధగధగ మెరుస్తున్నది. మొగంలో అందరినీ వివశుల్ని చేసే దరహాసం, సమ్మోహనకర అర్ధనిమీలిత నేత్రాలు.

జన్మ ధన్యమైనట్టు పరవశించిపోతున్నారు భక్తులు. వారు బారులుతీరి దారి చూపుతుండగా —బాహ్యప్రపంచంతో సంబంధం లేనట్టు, కలలో నడుస్తున్నట్టు అలవోకగా నడుస్తూ— వెళ్ళి కారులో కూర్చున్నారు స్వామీజీ. ఇంత హడావుడిలోనూ—కిందపడ్డ ముష్టివాడేమైనాడా అని—చుట్టూ చూసాడు వెంకట్రావు. దూరంగా చెట్టుకింద ఎవరో అతనికి ఉపచారాలు చేస్తున్నట్టున్నారు. "అమ్మయ్య" అని నిట్టూర్చి కారు పక్కకి చేరుకున్నాడు.

మంగళ వాద్యాలతో దిక్కులు పునీతం అయాయి. జయజయ ధ్వనులను అందుకున్న ఆకాశం అదృష్టం పండింది. కారు బయలు దేరింది, అతి నెమ్మదిగా. రెండువైపులా శిష్యులు వింజామరలు వీస్తూ కదిలిపోతున్నారు. వారి ప్రక్కగా సాగిపోతూ, స్వామీజీ పీల్చే గాలిని తానూ పీల్చగలిగిన అదృష్టం పొందినందుకు పులకరించి పోతున్నాడు వెంకట్రావు!

ఇక విడిదిలో అతని హడావుడి వర్ణనాతీతం. కొందరికి ఆజ్ఞలు జారిచేస్తూ మరికొందరి ఆజ్ఞలు శిరసావహిస్తూ ఆ భవనం అంతటా తానే అయి, ఊపిరి పీల్చుకోడానికి కూడా తీరిక లేకుండా, తిరుగుతున్నాడు.

* * *


స్వామీజీ కార్యక్రమాలు పూజలు, చర్చలు ఉపన్యాసాలతో మూడు రోజులలో విజయవంతంగా ముగిసాయి. శ్రీవారు పలుభాషల గ్రంథాలనుండి ఉదహరిస్తూ తమ వాదనా చమత్కృతితో సునిశిత హాస్యంతో గంభీర పదజాలంతో ప్రజల హృదయాలపై చెరగని ముద్రవేసారు. ప్రవాహంలా ప్రజలు ప్రక్క గ్రామాలనుండి కూడా బళ్ళలో వచ్చి పది రూపాయిలు ముడుపు చెల్లించి శ్రీవారి పాదుకా పద్మాలను స్పృశించి ధన్యులైనారు. ఊళ్ళోని లక్షాధికారులూ, వర్తకులూ, ఆఫీసర్లూ స్వామీజీ ప్రత్యేక దర్శనంకోసం వచ్చి, వెంకట్రావు అనుజ్ఞకోసం వేచి వుండేవారు! అంతగా పెరిగిపోయింది అతని పరపతి! తన ఆఫీసరుకూడా తన అనుమతికోసం వేచి వుండడం అతనికి ప్రత్యేక గర్వకారణం అయింది. తన ఆఫీసరుకు వెంకట్రావు ప్రత్యేక దర్శనం చేయించాడు. ఆయన పొంగిపోయి వెంకట్రావుని తెగ పొగిడాడు.

"ఈ దెబ్బతో నాకు ప్రమోషన్ తప్పదు" అని మురిసిపోయాడు వెంకట్రావు.

మూడు రోజులూ పట్నంలో ఏనోట విన్నా స్వామీజీ ప్రశంసయే. ఏచోట కన్నా స్వామీజీ చిత్రాలే. మూడోరోజు ఒక ప్రత్యేకతను సంతరించుకున్నది. ఆరోజు బహిరంగ సభకు లక్షమంది హాజరయారు. ఉపన్యాసం అయిన తరువాత శ్రీవారు కొన్ని అద్భుతాలు చూపారు. శూన్యహస్తంలో శ్రీచందనం తెప్పించారు. ఉంగరాలూ గడియారాల సంగతి చెప్పనే అక్కర్లేదు. ఆ అద్భుతంకాదు ప్రజలను ఆకర్షిస్తు!

ఉపన్యాసం మొదలయిన క్షణంనుండీ ముందు వరుసలో కూర్చున్న ఒక ముదివగ్గు దగ్గుతూ ఆయాస పడిపోతూనే వున్నాడు. చుట్టూవున్నవారు విసుక్కుంటూనే వున్నారు. అతడు ఖంగు ఖంగున దగ్గుతూవుంటే శ్రీవారు రెండుసార్లు ఉపన్యాసం ఆపవలసి వచ్చింది. అందుకు ప్రజలు కోపోద్రిక్తులై ఆ ముసలి వాణ్ణి బయటకు పొమ్మని కసురుకుంటున్నారు.

## (వి)చిత్ర విజ్ఞానం



యుద్ధకాలంలో అమెరికా, వియత్నాంలో తాత్కాలిక విమానాశ్రయాలను నిర్మించడానికి డైయాక్సిన్ అనబడే ఒక వృక్ష సంహారిణి మందును ఉపయోగించింది. ఈ మందు ఇప్పుడు వియత్నాం చుట్టూతా సముద్రంలోని చేపల దేహాల్లో పేరుకుపోయింది. ఈ చేపలను తింటే ముఖ్యంగా గర్భవంతులకు తీవ్రమైన హాని కలుగుతుందంటున్నారు — హార్వర్డ్ శాస్త్రజ్ఞులు డా॥ మాత్యూ మెసెల్సన్. ఈ మందు హిందూమహాసముద్రపు చేపలకు కూడ సోకిందట!!

---

అతడు తన దురదృష్టాన్ని నిందించుకుంటూ లేచి, తూలి పడిపోయాడు. స్వామీజీ ప్రసన్న వదనంతో అతనిని తీసుకురమ్మని సంజ్ఞచేశారు. నలుగురూ సాయంపట్టి అతనిని వేదికమీదకు తెచ్చారు. శ్రీవారు అతని వెన్ను నిమిరి భగవన్నామ సంకీర్తన చేయించారు. అంతే. అతడు దిగ్గున లేచాడు. దగ్గు మాయమయింది. దృఢంగా నడవగలిగాడు. ప్రజలంతా స్వామీజీ అద్భుత శక్తికి దిగ్భ్రమ చెందారు.

అలాంటి స్వామీజీ రేపు ఉదయమే వెళిపోతారని తెలిసి ప్రజలు తీవ్రంగా విచారించారు. కొందరు పెద్దలు స్వామీజీ కాళ్ళమీదపడి ఇంకొక్కరోజు ఉండవలసిందిగా ప్రాధేయపడ్డాడు. కాని శ్రీవారు రేపే బయలుదేరి తీరాలి. భక్తులు చూస్తే ప్రాధేయపడుతున్నారు. ఎలా? అందుకే వారు విశ్రాంతి తీసుకునే కాలాన్ని త్యాగంచేసి, కొంతమంది భక్తులకు ప్రత్యేక దర్శనం యివ్వడానికి దయతో అంగీకరించారు. ఆ కొందరు అదృష్టవంతులు శ్రీవారి పాదపూజచేసి తరించి సంతృప్తినిండిన మొగాలతో వెళిపోయారు.

చిట్టచివర వెంకట్రావు. అసలు శ్రీవారి పాదపూజ చేయడానికి వెయ్యిన్నూట పదహార్లు కానుక చెల్లించాలి. కాని చేసిన సేవలకు గుర్తింపుగా అతనికా సదుపాయం ఉచితంగా లభించింది. పాదపూజ పూర్తి అయినా అతడు లేవలేదు. ఏదో కోరికతో అలమటించిపోతున్నట్టు కూర్చున్నాడు.

కోటి మల్లెలు వికసించినట్టు శ్రీవారు ప్రోత్సాహకరంగా నవ్వారు. అతనికి ధైర్యం కలిగిందిగాని ఎలా చెప్పుకోవాలో తెలియలేదు. భార్య మూర్ఖత్వం, పాప ఆరోగ్యం గురించి శ్రీవారికి విన్నవించుకోవాలని అతని తపన.

ఈ మూడురోజులూ అతడు యింటికి వెళ్ళనేలేదు. పాప, భార్య వస్తారని చూచాడు. జనాలు ప్రక్కగ్రామాలనుండి కూడా ప్రవాహంలా శ్రీవారి పాదపద్మాల చెంతకు వచ్చినా, తనవారు రాలేదు! అతని మనస్సు చివుక్కుమన్నది. రమ్మని కబురు పంపినా ఆమె రాలేదు. కనీసం పాపను పంపలేదు. పాప వస్తే శ్రీవారు ప్రత్యేకంగా ఆశీర్వదిస్తే దాని ఆరోగ్యం కుదుటబడునుకదా. ఈ విషయాలు స్వామీజీకి చెబితే వారికి కోపం వస్తుందేమో. అదీ అతని సంశయం.

"సంశయం ఎందుకు చెప్పు...." కరుణ జాలువారుతున్న స్వరంతో శ్రీవారు అడిగారు.

ధైర్యం తెచ్చుకొని చెప్పాడు వెంకట్రావు. శ్రీవారు గలగల నవ్వారు.

"తమ ఆశీర్వాద భాగ్యంకోసం వారిని యిక్కడకు తీసుకువద్దామనుకున్నా...."

"మేము నిన్ను ఆశీర్వదిస్తాము. చాలు."

వినమ్రుడై పాదాలకు మరల నమస్కరిం

చాడు వెంకట్రావు. అతని నెత్తి మీద చెయ్యి పెట్టారు స్వామీజీ. సర్వలోకాలను జయించినంత సంబరంగా బయటకు వచ్చాడు వెంకట్రావు.

*    *    *

బయట ఏదో గలాటా జరుగుతోంది. పోలీసులు ఎవరినో లాఠీలతో మోదుతున్నారు. మొదట అతడు ఎదురుతిరిగాడు గాని తరువాత లొంగిపోయాడు. లొంగిపోయినా, పోలీసులు అతనిని మోదుతూనే వున్నారు. అతడు స్పృహ తప్పే స్థితికి వచ్చాక "పోరా వెధవా, మళ్ళా యీ చాయల్లో కనిపిస్తే జైల్లో పడవేస్తాం" అని తోసేసారు.

శక్తి ఉడిగిన వాడు తూలుతూ వచ్చి వెంకట్రావు కాళ్ళముందు పడ్డాడు. వెంకట్రావు గుండె ఝల్లుమన్నది. అతడెవరో కాదు. ఒకనాటి తన స్నేహితుడు. పేరు జ్ఞాపకం లేదుగాని....నిప్పుల్రావు అని పిలిచేవారు అతనిని. అతనివన్నీ తీవ్ర భావాలు. అన్యాయాన్ని సహించేవాడు కాదు. ఎప్పుడూ ఎవరి మీదనో నిప్పులు కక్కుతూ ఉండేవాడు. వాడు హటాత్తుగా యిలా ప్రత్యక్ష్యం అయేసరికి ఆశ్చర్యపోయాడు వెంకట్రావు.

వలంటీర్ల సహాయంతో అతనిని ఒక గదిలో చేర్చి, ఉపచారాలు చేసి, కాఫీ యిస్తే తేరుకున్నాడు.

"ఏమిటిది?" అడిగాడు వెంకట్రావు.

"నువ్వే చెప్పాలి!" కస్సుమన్నాడు నిప్పులాౖవు.

పది సంవత్సరాలతర్వాత కలిసిన స్నేహితుడు మాట్లాడే తీరుచూసి "నువ్వేమీ మారలేదు" అని నవ్వాడు.

"క్షణక్షణానికీ మారేది నువ్వు. నేనుకాదు. ఒకప్పుడు నువ్వు ఆదర్శవాదివి. తరువాత భక్తుడువి. ఇప్పుడు మోసగాడివి."

ఈ ఆరోపణ విని నిర్ఘాంతపోయాడు వెంకట్రావు.


"ఒరేయ్. ఆశ్చర్యపోకు. అమాయకత్వాన్ని నటించకు. నీలో కాస్త నిజాయితీ వుందేమో అనుకున్నా. కానీ నువ్వూ భక్తుల మందలో ఒకడివే. మీరంతా భక్తులు! ముఖం నిండా నామాలు ఒకడికి; చెవిలో పువ్వు మరొకడికి; రుద్రాక్షమాల లొకడు! పేరుకు భక్తులు. చేసేవన్నీ మోసాలే. మీ భక్తులంతా చేరి ఆ రోజు స్టేషన్‌లో ముష్టివాణ్ని తొక్కేసి సరాసరి స్వర్గానికి పంపేవారు! సమయానికి నేనక్కడే వుండబట్టి వాడు బ్రతికిపోయాడు. తిండిలేక చస్తున్న సాటి మానవుడికి పట్టెడన్నం పెట్టలేరు. కనికరం చూపలేరు. కాని ఒక మోసగాడు మోళీకడితే వాడి పాదపూజ చేస్తారు; వెయ్యిన్నూటపదహార్లిచ్చి! పదిరూపాయిలిచ్చి పాదుకల పూజ చేస్తారు! ఛీ. మీరు భక్తులా? పరమమూర్ఖులుగాని! గుండె మీద చేయి వేసుకొని నిన్ను నీవే ప్రశ్నించుకో. నువ్వు నిజంగా భక్తుడివా? భక్తి మాటున లంచంకొట్టే మోసగాడివి కాదా? భక్తి ముసుగులో ప్రమోషన్‌కోసం ప్రాకులాడే స్వార్ధపరుడివి కాదా?...."

నిప్పులు కురిపిస్తున్నాడు, లేని ఓపిక తెచ్చుకొని, నిప్పులాౖవు. అతనిని కాదని వాదనలోకి దిగడం మరింత బాధను ఆహ్వానించడమే అని తెలుసు వెంకట్రావుకి. అయినా స్వామి నిందను భరించలేకపోయాడు.

"నీకు స్వామీజీ గురించి తెలియదు" అన్నాడు నెమ్మదిగా.

"అయితే నీకు పూర్తిగా తెలిసే ఈ మోసంలో భాగం పంచుకుంటున్నావన్నమాట. పైగా భక్తుడివి!" వ్యంగ్యంగా ఎత్తి పొడిచాడు నిప్పులు.

తన భక్తిని ఎవరైనా శంకిస్తే వెంకట్రావుకి బాధగానే వుంటుంది. తెచ్చుకుంటున్న జీతం సరిపోక అడపా దడపా కానుకలు స్వీకరించడం భుక్తి కోసం. భుక్తి లేకపోతే భక్తి ఎక్కడ?—ఇవన్నీ నిప్పులాౖవుకి అర్థంకావు. ప్రతి విషయాన్నీ రంగు అద్దాలోంచి చూస్తూ "మోసం, మోసం" అని గావుకేకలు పెట్టడం నిప్పులాౖవుకి మొదటి




నుండీ అలవాటే. అందుకే ప్రసంగం మార్చా లనుకున్నాడు వెంకట్రావు.

"పోలీసులు నిన్నెందుకు కొట్టారు?" అడిగాడు.

"నీకు తెలియనట్టు!" గుర్రుమన్నాడు నిప్పులు.

"ప్రతి విషయాన్నీ అనుమానించడం మంచిదికాదు.... నాకు నిజంగా తెలియదు."

అతని స్వరంలోని నిజాయితీని గమనించి మెత్తబడ్డాడు నిప్పులు.

"నేను హేతువాదిని. బాబాల బండారం బయపెట్టడం నా ధ్యేయం. మ్యాజిక్‌లు చేసి పొట్ట గడుపుకోడం నా వృత్తి. మీ బాబా లానే శూన్యహస్తంలోంచి విభూతి రప్పించ గలను.... ఇదిగో."

చూసి ఆశ్చర్యపోయాడు వెంకట్రావు.

"ఇదిగో వాచీ.... నేను తలచుకుంటే ఈ వెధవకంటే ఎక్కువ 'మహత్యాలు' చూపి లక్షలు ఆర్జించగలను...."

వాడు స్వామీజీని - వెధవ - అన్నందుకు, తను విన్నందుకు మనసులోనే 'లెంపలు' వేసుకున్నాడు వెంకట్రావు.

"మీ సాములారిని సవాలు చేయటానికే నేనిక్కడకు వచ్చాను. అందుకే నాకీ సన్మానం!—ఇంత పట్నంలోనూ నేను ఏకాకిని. నాకు ఒక నలుగురు సాయం వుంటే ఈ బాబా పని పట్టేవాడిని.... పోనీ నువ్వు— నువ్వైనా నాకు కాస్త సాయం చేయ కూడదూ?...."

వణికిపోయాడు వెంకట్రావు. "మన దేశంలోని ప్రముఖ శాస్త్రజ్ఞులే అతీంద్రియ శక్తులున్నాయని నమ్ముతున్నారు." అన్నాడు నెమ్మదిగా.

"అందరికంటే సులభంగా శాస్త్రజ్ఞులే బోల్తా పడతారని నా మాజిక్ ద్వారా నిరూపిస్తా" ఛాలెంజి చేస్తున్నట్టు అన్నాడు నిప్పులు.

"స్వామీజీ ఆ ముసలివాణ్ని చిటికెలో బాగుచేసారు."

"రోడ్డుప్రక్క మోళీవాడుకూడా ఆ ట్రిక్ చేయగలడు.... ఆ ముసలివాడు ఆ గాంగ్‌లోని మనిషే. అంతా నటన!"

నమ్మలేకపోయాడు వెంకట్రావు.

అతని సంశయమూ, తటపటాయింపూ చూసి మళ్లీ నిప్పులు కురిసాడు నిప్పులాశ్రివు.

"మన దేశ దౌర్భాగ్యం ఏమిటో గాని



"ఆ రెండూ పక్క పక్కన పెట్టడంలో నీ ఉద్దేశమేమిటో నా కర్థమైంది ప్రమీలా!"

---

దేశంలో విద్యావంతులు బాగా తక్కువ. వారిలోనూ నీలాంటి మూర్ఖులే ఎక్కువ. నేను నేనుగా చేసే పనులను మాజిక్ అంటారు. అదే సాములారు చేస్తే మహిమ అంటారు. నేను బాబాలను సవాల్ చేస్తే ఎవరూ పట్టించుకోరు. నాకు అవకాశం యివ్వరు. పైగా బాబాలనే సమర్థిస్తారు. శాస్త్రజ్ఞుల ముందు నా విద్యను ప్రదర్శిస్తానంటే నన్ను పరీక్షించడానికి వారు ముందుకు రారు. నేనే బురఖా మార్చేసి స్వామీజీలా వేషం వేస్తే చాలు—మీరంతా — శాస్త్రజ్ఞులతోసహా—నా పాద ధూళిని నెత్తిన వేసుకొని, నా చుట్టూ భజనలు చేస్తారు! లక్షలు కుమ్మరిస్తారు!....సరే నువ్వేం సాయం చేయనక్కర్లేదులే. నే నొక్కణ్ణే ఈ రాత్రి ఈ సాములారి బండారం బయట పెట్టకపోతే నా పేరు...." అంటూ దృఢ ప్రతిజ్ఞ పట్టాడు నిప్పులు.

భయపడుతూ, వణికిపోతూ, అతనివైపు చూసిన వెంకట్రావు గుండె ఝల్లుమన్నది.

ఇందాక పోలీసుల లాటీ దెబ్బలవల్ల నెత్తిమీద చిట్లిన రక్తనాళాలనుండి యిప్పుడు ఆవేశంవల్ల ఉబికి కాలనాగు నాలుకల్లా నుదుటి మీదకు ప్రవహిస్తున్నది. అతని కళ్లు రక్తాన్నే కురుస్తున్నవి. ఆవేశం ఝంఝూమారుతంలా అతనిని ఊపివేస్తున్నది. ఆ ఝంఝూమారుతంలో జ్వాజల్యమానంగా ప్రజ్వలిస్తున్న చిచ్చరపిడుగులా నిలిచివున్నాడతడు.

ఆ కాంతిని భరించలేనివాడిలా కళ్లు మూసుకున్నాడు వెంకట్రావు. ఆ రాత్రి అక్కడ వుండడం క్షేమం కాదనిపించి, శ్రీవారి సెక్రటరీ వద్ద సెలవు పుచ్చుకొని యింటికి వెళ్ళిపోయాడు.

అతని మెదడులో అనుమానాలు పిశాచ నృత్యం చేస్తూ అతనికా రాత్రి నిద్రను దూరం చేసాయి.

* * *

తెల్లవారుతూనే వేలాది భక్తులు ఆ భవనం చుట్టూ మూగారు. భవనంనుండి కారువరకూ మార్గం అంతటా పూలు పరిచారు. మంగళ వాద్యాలు మోగుతున్నాయి. జయజయ ధ్వానులతో దిక్కులు పిక్కటిల్లాయి. బాల భానునిలా మెరిసిపోతూ శ్రీవారు కారులో ఆసీనులైనారు. కారుతోబాటు భక్తులు స్టేషను వరకూ ఊరేగింపుగా సాగిపోతున్నారు. కాని ఆశ్చర్యం! వెంకట్రావు ఊరేగింపులో లేడు. అప్పుడే మేలుకొన్నట్టు; దేనినో వెదుక్కుంటున్నవాడిలా అక్కడే వుండిపోయాడు. స్వామీజీ ఊరేగింపు కనుమరుగు కాగానే ఇంకో 'ఊరేగింపు' బయలుదేరింది. పోలీసులు భవనంనుండి ఒక శవాన్ని బయటవున్న వ్యాన్‌వద్దకు మోసుకు వస్తున్నారు!

అక్కడే వుండిపోయిన కొందరు భక్తులు శవంచుట్టూ మూగారు, ఆశ్చర్యంగా "వీడు నిన్న స్వామీజీని సవాలు చేయడానికి వచ్చాడు! సవాలు చేయడానికి! వీడెంత? వీడి బ్రతుకెంత? స్వామీజీనే సవాలు చేసే వాడా వీడు? అందుకే దేవుడే శిక్షించాడు. రక్తం కక్కుకొని రాత్రే చచ్చాడు." వివరిస్తున్నాడు పోలీసు.

భక్తులు పరమానందభరితులై "స్వామీజీకి జై" అని అరిచారు. వ్యాన్ కదిలింది.

హృదయం కలుక్కుమనగా "నిప్పు ఆరిపోయింది....కాదు... ఆర్పివేసారు." అనుకున్నాడు వెంకట్రావు. ఆశ్చర్యం! అలాంటి భావం కలిగినందుకు అతడు వణికిపోలేదు!

□